క్లుప్తంగా

రైతుబజార్‌లో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇక్కడి రైతులు, వ్యాపారులు గురువారం అన్నసమారాధన నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, స్థానిక నాయకుడు పట్టాభి, రైతుబజార్ ఈవో ప్రసాద్ భక్తులకు భోజనాలు వడ్డించారు. సాయంత్రం స్వామి అనుపు కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి అనుపు ఘనంగా జరిగింది.

మహా అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం 22వ వార్డు పిఠాపురం కాలనీలోని ఎస్‌వై బాయ్స్ మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత వసంతలక్ష్మి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని శివాజీపాలేనికి చెందిన కోన వసంతలక్ష్మి అనే దాత రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఏఈవో పిల్లా శ్రీనివాసరావుకి అందించారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న పల్లా దుర్గారావు


బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పిఠానిదిబ్బ ప్రాంతంలో యూజీడీకి గురువారం కార్పొరేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పర్యవేక్షించారు. వర్షా కాలం కావడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా వార్డు మొత్తం యూజీడీలకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎంవీపీకాలనీ: ఏపీఈపీడీసీఎల్ ఎంవీపీ కాలనీ సెక్టార్-1, సెక్టార్-2 కొత్త వెంకోజీపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, స్థానిక ప్రజలు గమనించాలని కోరారు.



ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల అక్రమ భవనం



20వ వార్డు పెదవాల్తేరులో నిబంధనలు మీరి నిర్మిస్తున్న భవనం



చినవాల్తేరు అమ్మవారి వీధిలో అనధికార బహుళ అంతస్తుల నిర్మాణం

జోరుగా అక్రమ నిర్మాణాలు

- 17, 18, 19, 20 వార్డుల్లో యథేచ్ఛగా అనధికార కట్టడాలు
- కనీస నిబంధనలు పాటించని నిర్మాణదారులు
- జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు శూన్యం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ జోన్-3 పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వాటికి అడ్డుకట్ట వేయకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంవీపీ కాలనీ పరిధి 17, 18, 19 వార్డులతోపాటు 20వ వార్డులో పెద్ద ఎత్తున అనధికార కట్టడాలు జరుగుతున్నా.. కనీస చర్యలు లేకపోవడమే ఇందుకు నిదర్శనం. జీవీఎంసీ ఆమోదించిన ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా.. ఎక్కడా అది అమలు కావడంలేదు. దీంతోపాటు చాలా నిర్మాణాలు కనీస అనుమతులు లేకుండా జరుగుతున్నాయి. ఇటువంటి వాటిని నిత్యం పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జీవీఎంసీ టౌన్ ప్లానింగ్‌పై ఉంది. ఆ విధమైన చర్యలు ఎక్కడా కనిపించకపోగా.. కొన్ని అక్రమ నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులే కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు బిల్డర్లతో కుమ్మక్కవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వార్డుల్లో ఇదే పరిస్థితి..

నియోజకవర్గంలోని 17, 18, 19, 20 వార్డుల్లో పెద్ద ఎత్తున అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 10 అడుగుల రోడ్డు కూడా లేని చోట బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు.



ఇందిరానగర్ గ్రీన్‌బెల్ట్‌లో శాశ్వత నిర్మాణాలు

- ఎంవీపీ కాలనీ బుద్ధవనం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా జీ+5 నిర్మాణం చేపట్టారు. ఈ స్థలంలో జీ+3 నిర్మాణానికి మాత్రమే అనుమతి ఉండగా.. నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ కార్యదర్శితోపాటు టీపీటో స్థాయి అధికారి కొమ్ముకాస్తున్నట్లు సమాచారం.
- 20వ వార్డు చినవాల్తేరు అమ్మవారి వీధిలో జీ+2 నిర్మాణానికి మాత్రమే అనుమతి పొంది అదనపు అంతస్తులను అక్రమంగా నిర్మిస్తున్నారు. దీనిపై స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా..చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- 20వ వార్డు పెదవాల్తేరులోని ఓ ఇరుకు సందులో చిన్న స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై స్థానికులు టౌన్ ప్లానింగ్ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు.

గ్రీన్‌బెల్ట్‌లో శాశ్వత నిర్మాణాలు..

17వ వార్డు ఇందిరానగర్‌ను ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో కొన్నాళ్లుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. 1985లో జీవీఎంసీ ఈ ఎస్సీ కాలనీని నిర్మించింది. బీటీ రోడ్డు, కమ్యూనిటీ హాల్, గ్రీన్‌బెల్ట్ అభివృద్ధిని ప్లాన్‌లో చూపించింది. నేటికీ గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణం ఇక్కడ జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రీన్‌బెల్ట్‌లో నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. వారి డిమాండ్‌తో గ్రీన్‌బెల్ట్ నిర్మించేందుకు జీవీఎంసీ మరోసారి ముందుకొచ్చినా.. రాజకీయ ఒత్తిళ్లతో అది కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లలో ఇక్కడ ఎలాంటి శాశ్వత నిర్మాణాలకు అనుమతియ్యలేదు. ప్రస్తుతం మరోసారి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇక్కడ కొన్నాళ్లుగా శాశ్వత నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నా.. అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

క్రికెట్ లీగ్ విజేత 'గుడ్‌షెపర్డ్'

విశాఖ స్పోర్ట్స్: యునైటెడ్ ఇన్‌ట్రెస్ట్ క్రిష్టియన్ క్రికెట్ లీగ్ విజేతగా గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిలిచింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో గురువారంతో ముగిసిన టోర్నీ ఫైనల్‌లో గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లకు 101 పరుగులు చేసింది. ప్రతిగా ట్రూలైట్స్ చర్చ్ మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. శ్రావణ్ 62 రన్స్ చేశాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో పలు క్రైస్తవ చర్చ్‌ల జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ విభాగపు అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమనే క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవడమే ఆటల ప్రధాన లక్షణమన్నారు. బహుమతి ప్రధానోత్సవంలో జగన్నాథరావు, నేతన్ ఐజాక్, ఎం.ప్రసాద్, సునీల్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జాన్‌వెస్లీ

త్రీ టౌన్ సీఐ రమణయ్య బాధ్యతల స్వీకరణ



బీచ్‌రోడ్డు: త్రీ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా పల్లా రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెందుర్తి, అనకాపల్లి, ఎంవీపీ, నర్సీపట్నం స్టేషన్లలో పనిచేశారు. 2006లో ఇదే స్టేషన్‌లో ఎస్ఐగా శిక్షణ పొందారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా శ్రమిస్తానన్నారు. సిబ్బందితో కలిసి సమన్వయంగా పనిచేస్తానని తెలిపారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి

బీచ్‌రోడ్డు: ముస్లింలతోపాటు వెనుకబడిన కులాల సంక్షేమానికి కృషి చేస్తామని రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అస్లాం ఖాన్ తెలిపారు. చినవాల్తేరు తమిళ్ స్ట్రీట్‌లోని 21వ వార్డు సమితి కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వారి సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు. సంఘ సేవకుడు, సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తామని, విజయవాడ వరద బాధితులకు సమితి ద్వారా భోజనాలు, నిత్యావసర వస్తువులు అందించామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సలీం, కళా సంస్థల ప్రతినిధి చెన్నా తిరుమలరావు, దళిత సంఘాల నాయకులు నీలాపు వెంకటరావు, రైల్వే ప్రసాద్, ఇతర కులాల నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో మహ్మద్ అస్లాం ఖాన్ తదితరులు

క్విజ్ పోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చూపారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ నుంచి జూనియర్ అండర్ ఆఫీసర్ సీహెచ్ లక్ష్మీ పల్లవి, ఎస్‌జీటీ ఎస్. కిరణ్మయి నేవల్ మెడికల్ యూనిట్ నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ క్విజ్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల గురువారం వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి. సంతోషి, అనూష తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

మద్దిలపాలెం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేదలు, కార్మిక వర్గానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయనకు విశాఖతో ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన పార్టీ అఖిల భారత మహాసభలోనే ఏచూరి కార్యదర్శిగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. విద్యార్థి ఉద్యమం నుంచి చివరి వరకు పేదలు, కష్టజీవుల కోసమే అహర్నిశలు కృషి చేశారన్నారు. విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ షిప్‌యార్డును రక్షణ రంగంలో విలీనం చేయడం, బీహెచ్‌పీవీని బీహెచ్ఈఎల్ విలీనం చేయడంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. సీతారాం మృతితో సమర్థవంతమైన నాయకుడిని కోల్పోయామన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఐక్యంగా పోరాడుతామన్నారు.

పార్కింగ్ స్థలంలో కుర్చీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: బీచ్ రోడ్డులోని ఫాస్ట్ ఫుడ్ కోర్టులు పార్కింగ్ స్థలంలో కుర్చీలు ఏర్పాటు చేసి ఆక్రమించడంతో వాహనాల నిలిపివేతకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమస్యపై 'పార్కింగ్ స్థలాలే ఫుడ్ కోర్టులు' అనే శీర్షికన ఈ నెల 11న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన కుర్చీలను గురువారం తొలగించారు. దీంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాలను పార్క్ చేసుకునేందుకు సందర్శకులకు స్థలం లభించింది.

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం

పార్కింగ్ స్థలాల్లో ఉన్న ఫుడ్ కోర్టులను, కుర్చీలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. దీంతో వాహనాల పార్కింగ్‌కు సాగరతీరంలో చాలా స్థలం అందుబాటులోకి వచ్చింది. అయితే ట్రాఫిక్ పోలీసులు మాత్రం మేలుకోలేదు. వాహనాలను ఇంకా రోడ్డు మీదే పార్కింగ్ చేయిస్తున్నారు తప్ప.. పార్కింగ్ స్థలంలో చేసుకోవాలని చెప్పడం లేదు. దీంతో పార్కింగ్ స్థలాలు ఖాళీగా ఉన్నా.. బీచ్ రోడ్డు మీదే సందర్శకులు తమ వాహనాలను నిలుపుతున్నారు.



బీచ్ రోడ్డులోని పార్కింగ్ స్థలంలో తొలగించిన ఫుడ్ కోర్టు కుర్చీలు

జీవో 115 రద్దు చేయాలి



విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

ఆరిలోవ: ఆస్పత్రుల్లో నర్సింగ్ సిబ్బందికి ఇబ్బందిగా మారిన జీవో నంబర్ 115ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని విమ్స్ నర్సింగ్ సిబ్బంది కోరారు. ఈమేరకు గురువారం విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. జీవో 115 రద్దుతోపాటు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్స్ జయరాజు మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు కష్టపడి నర్సింగ్ చదువుకుని కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఈ జీవో వల్ల నష్టం కలుగుతుందన్నారు. 2010 నుంచి ఇంతవరకు నేరుగా స్టాఫ్ నర్సులను భర్తీ చేయలేదని చెప్పారు. ఈ పోస్టుల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పుడు ఏఎన్ఎంలను నేరుగా స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం వల్ల తాము నష్టపోతున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలకు జీఎన్ఎం శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం మంచి పద్ధతి కాదని సూచించారు. కార్యక్రమంలో నర్సులు భారతి, భరత్, శాంతి, శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

డైడాక్-ఇండియా సదస్సుకు మళ్ల రామునాయుడికి ఆహ్వానం



మహారాణిపేట: ఆసియాలో అతి పెద్ద సంస్థయిన డీఐడీఏసీ(డైడాక్) - ఇండియా సదస్సుకు స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రామునాయుడికి ఆహ్వానం లభించింది. ఈ నెల 18 నుంచి 20 వరకు న్యూఢిల్లీ యశోభూమి(ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్స్ అండ్ ఎక్స్‌పో సెంటర్)లో జరిగే ఈ సదస్సుకు హాజరు కావాలని తనకు ఆహ్వానం అందినట్టు రామునాయుడు తెలిపారు. విద్యా రంగంలో వినూత్న విధానాలు, కేజీ స్థాయిలో ఎటువంటి పుస్తకాలు లేకుండా పాఠశాలలో పెంపొందించే ఉత్తమ అభ్యాసాలతో భారతీయ విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి రామునాయుడు విశేష కృషి చేస్తున్నారు. దీనికి గాను ఆయనను ఈ సదస్సుకు ఎంపిక చేశారు.

ముడసర్లోవ పార్కులో డస్ట్‌బిన్లు శిథిలం

ఆరిలోవ: జీవీఎంసీ నిర్వహిస్తున్న ముడసర్లోవ పార్కులో డస్ట్‌బిన్లు విరిగిపోయాయి. పార్కులకు వెళ్లిన సందర్శకులు వేస్టేజీని ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో వేసిన చెత్తను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేస్తుంటారు. ఇందులో భాగంగా ముడసర్లోవ పార్కులో కూడా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని విరిగిపోగా.. మరికొన్నింటికి అడుగు భాగంలో పెద్ద రంధ్రాలు పడ్డాయి. దీంతో వీటిలో చెత్త వేసినా ఉపయోగం లేకుండా పోతోంది. విరిగిన డస్ట్‌బిన్లలో వేసిన చెత్త బయటకు చెదిరిపోతోంది. ఇవి పాడవడం వల్ల కొందరు చెత్తను బయట వేసేస్తున్నారు. దీంతో పార్కు అధ్వానంగా మారుతోంది. విరిగిన వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త డస్ట్‌బిన్లు ఈ పార్కులో ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.





ముడసర్లోవ పార్కులో విరిగిన డస్ట్‌బిన్లు

వినాయక మండపాల్లో విశేష పూజలు



జేఆర్ నగర్‌లో వినాయక మండపం వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం: వినాయక చవితి వేడుకల్లో భాగంగా 15వ వార్డు జేఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన మండపం వద్ద గురువారం అధిక సంఖ్యలో స్థానిక మహిళలు కుంకుమార్చన, పారాయణం చేశారు. భక్తులకు ప్రసాదం అందించారు. కొత్త వెంకోజీపాలెంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన పూరి జగన్నాథ స్వామి నమూనా వినాయక మండపం వద్ద గురువారం రాత్రి మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చరిత్రకు సంబంధించిన గీతాలు ఆలపించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయిరాం కాలనీలో గణపతి మండపం వద్ద ఘనంగా దీపారాధన చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి యాగం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరు రజక వీధి బెస్ట్ ఫ్రెండ్స్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక దంపతులు భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి యాగం నిర్వహించారు. ఇక్కడ అయోధ్య బాలరాముడి రూపంలో కొలువైన బాలగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ భజనతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న మహా అన్నదానం, 16న దీపారాధన, 19న సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 22న బాలగణపతి మహా నిమజ్జన కార్యక్రమం జరుగుతుందన్నారు.



లక్ష్మీగణపతి యాగం చేస్తున్న దంపతులు



20వ వార్డులో అయోధ్య బాలరాముడిగా కొలువైన గణపతి



సాయిరాం కాలనీలో దీపారాధన



కొత్త వెంకోజీపాలెం మండపం వద్ద మహిళల భజన

మహాధర్నాను విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్: ఈ నెల 15న పాత గాజువాకలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ విధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలని, టీడీపీ, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ రక్షణకు పూనుకోవాలని, ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన మహాధర్నా పోస్టర్ గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మాకు అధికారం ఇవ్వండి.. స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదు.. ప్రభుత్వ రంగంలో మరింత బలోపేతం చేస్తాం అని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. ప్రజలు నమ్మి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను అగాథంలోకి నెట్టే చర్యలను కేంద్రం చేపడుతుంటే కూటమి నిలదీయకపోవడం ప్రజల ఆశలను వమ్ము చేయడమేనన్నా. మోదీ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. 15న ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో తలపెట్టే మహాధర్నాకు ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.